శ్వేతసౌధ పీఠంపై మరోసారి

- అమెరికా అధ్యక్షుడిగా నేడు ట్రంప్ ప్రమాణం
- నాడు నిరసనలు.. నేడు అక్కడే సంబరాలు
- వేలాదిగా తరలివస్తున్న మద్దతుదారులు

ట్రంప్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న ముకేశ్ అంబానీ దంపతులు

వాషింగ్టన్, జనవరి 19: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సోమవారం రెండోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. దేశం రాజకీయంగా రెండుగా చీలిపోయిన తరుణంలో వైట్ హౌస్‌లోకి తిరిగి వస్తున్న ట్రంప్ అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుద్దాం అన్న తన నినాదాన్ని నిలబెట్టుకుంటారని ఆయన మద్దతుదారులు ఆశిస్తున్నారు. ట్రంప్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వాషింగ్టన్‌లో గట్టి భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2021లో డెమోక్రాట్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ఓటమి పాలైన అనంతరం అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు తన మద్దతుదారులతో కలసి రాజధాని నగరంపై ట్రంప్ దండెత్తగా ఈసారి నిరసనలు, అశాంతి, హింస వంటి అవాంఛనీయ పరిణామాలేవీ జరగబోవని అధికారులు అంచనా వేస్తున్నారు. గతానికి భిన్నంగా నగరం వేలాది మంది ట్రంప్ మద్దతుదారుల సంబరాలతో సందడిగా మారింది. గత అధ్యక్ష ఎన్నికలలో బైడెన్ విజయం సాధించడంతో ఓటమి భారంతో ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి సైతం దూరంగా ఉన్న ట్రంప్ ప్రస్తుత 2024 ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలుపొందారు. 2012లో డెమోక్రట్ అభ్యర్థి బరాక్ ఒబామా తర్వాత అంతటి భారీ విజయం ట్రంప్‌కే దక్కడం విశేషం. అయితే రిపబ్లికన్ అభ్యర్థిగా విజయం సాధించి అధికార పీఠాన్ని ఎక్కనున్న ట్రంప్‌ను అమెరికా చరిత్రలోనే ఎవరికీ లేనంత మంది ప్రత్యర్థులతోపాటు మద్దతుదారులు కూడా ఉండడం గమనార్హం. రాజకీయంగా తనను విభేదించేవారిని కలుపుకునిపోతూ తాను చేసిన ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవడం ట్రంప్‌కు కత్తిమీద సాముగా మారనున్నది. అమెరికా అధ్యక్షుడిగా తాను చేసే తొలి ప్రసంగంలో ఐక్యతను సాధించడమే ప్రధాన అంశం కానున్నట్టు శనివారం ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్న జో బైడెన్ శనివారం పూర్తి సమయం తన కార్యాలయంలో గడిపారు. గత వారంలో జరిగిన తన వీడ్కోలు సమావేశంలో బైడెన్ ప్రసంగిస్తూ దేశంలో సంపన్నుల ప్రయోజనాలను కాపాడే వ్యక్తులు అధికారంలోకి రావడం వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

భారత్ పర్యటనపై ట్రంప్ యోచన!

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించబోతున్నట్లు తెలుస్తున్నది. చైనాతో సత్సంబంధాలను పటిష్టపరచుకోవాలని ఆయన కోరుకుంటున్నారని, అందుకే ఆయన పదవిని చేపట్టిన తర్వాత చైనాకు వెళ్లాలనుకుంటున్నారని సమాచారం. ఆయన భారత్‌లో పర్యటించడంపై కూడా తన సలహాదారుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. విదేశాంగ మంత్రి జైశంకర్ గత నెలలో వాషింగ్టన్‌కు వెళ్లినపుడు ట్రంప్ బృందంతో ప్రాథమిక స్థాయి చర్చలు ప్రారంభమైనట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇదిలావుండగా, భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్‌లతో కూడిన క్వాడ్ సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వబోతున్నది. ఈ వేసవి కాలంలో అమెరికాకు రావాలని మోదీని ట్రంప్ ఆహ్వానించే అవకాశం కూడా కనిపిస్తున్నది.

తొలి రోజే వందకు పైగా సంతకాలు

అమెరికా అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే వందకు పైగా అధికారిక ఉత్తర్వులపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు)పై సంతకం చేయనున్నారు. వీటిలో చాలావరకు ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలకు సంబంధించినవే ఉంటాయని తెలుస్తోంది. మొదటి రోజే రికార్డు స్థాయిలో అధికారిక ఉత్తర్వులపై సంతకం చేయనున్నట్టు శనివారం ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. అధ్యక్షుడు ఏకపక్షంగా తనకు సంక్రమించిన అధికారాలతో జారీ చేసే ఉత్తర్వులను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లుగా వ్యవహరిస్తారు. దీనికి అమెరికన్ పార్లమెంట్ ఆమోదం అవసరం లేదు. వీటిని పార్లమెంట్ తిరస్కరించే అధికారం లేనప్పటికీ న్యాయస్థానంలో వీటిని సవాలు చేయవచ్చు.

ఇజ్రాయెల్ బందీలను రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అప్పగిస్తున్న హమాస్ మిలిటెంట్లు

గాజాలో శాంతి వీచికలు

అమల్లోకి కాల్పుల విరమణ ఒప్పందం

ముగ్గురు బందీలను విడిచిపెట్టిన హమాస్

గాజా స్ట్రిప్, జనవరి 19: చిరకాలంగా ఎదురుచూస్తున్న కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రారంభం కావడంతో గాజాలో శాంతి వీచికలు ప్రారంభమయ్యాయి. తమ వద్ద బందీలుగా ఉన్న రోమి గోనెన్ (24), ఎమిలీ దామరి (28), డోరోన్ స్టీన్‌బ్రెచర్ (31)లను హమాస్.. రెడ్ క్రాస్ ప్రతినిధుల ద్వారా ఇజ్రాయెల్ సైన్యానికి ఆదివారం అప్పగించగా, వారు ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. బందీల విడుదల దృశ్యాలను వేలాది మంది ఇజ్రాయెల్ పౌరులు టీవీలలో లైవ్‌లో చూసి ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఆరు వారాల్లో మిగిలిన 33 మందిని కూడా విడుదల చేయనున్నట్టు హమాస్ ప్రకటించింది. కాగా, ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్ కూడా తొలి విడతగా తమ వద్ద ఉన్న 90 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనుంది. తర్వాత విడతల వారీగా మొత్తం 2,000 మందిని వదిలిపెడుతుంది. అంతకు ముందు 42 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం అమలును హమాస్ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభించింది. ఒప్పందం అమలు కొన్ని గంటలు ఆలస్యం కావడంతో ఈలోగా ఖాన్‌యూనిస్ నగరం దక్షిణ భాగంపై ఇజ్రాయెల్ వాయుసేన దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో 26 మంది మరణించినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. సాంకేతిక క్షేత్ర కారణాల వల్లే ఒప్పందం అమలు ఆలస్యమైనట్టు హమాస్ పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది.

గాజాకు తిరిగి వస్తున్న పౌరులు

యుద్ధంతో దెబ్బతిన్న గాజాలో ఆదివారం పౌరుల సంబరాలు మిన్నంటాయి. యుద్ధ భయంతో 15 నెలల క్రితం ఇళ్లు, ఆస్తులను వదిలి బతుకు జీవుడా అంటూ వెళ్లిపోయిన లక్షలాది మంది పాలస్తీనియన్లు తమ ఇళ్లకు తిరిగి రావడం ప్రారంభించారు. ఒక పక్క కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం కాలేదు, మరో పక్క ఇజ్రాయెల్ తన వాయుసేన దాడులు కొనసాగిస్తూనే ఉంది, అయినా లక్ష్యపెట్టక వేలాది మంది పౌరులు కాలినడక, గాడిదలు లాగే బండ్లపై గాజాకు చేరుకోవడం కన్పించింది.

పునరుద్ధరణకు దశాబ్దాల కాలం

15 నెలల పాటు సాగిన ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో 46 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వారిలో సగం మంది మహిళలు, పిల్లలే. 1.10 లక్షల మంది గాయపడ్డారు. 23 లక్షల మంది ఉన్న జనాభాలో 19 లక్షల మంది దేశం వదిలి శరణార్థులుగా మారారు. ఇజ్రాయెల్ కురిపించిన బాంబుల వర్షానికి భవనాలు, ఇళ్లు శిథిలాలుగా మారాయి. 69 శాతం ఆస్తులు ధ్వంసం అయినట్టు ఐక్యరాజ్య సమితి గత నెలలో అంచనా వేసింది. వీటిని పునరుద్ధరించడానికి కొన్ని దశాబ్దాలు పడుతుందని అంచనా వేస్తున్నారు. పేరుకుపోయిన శిథిలాలను తొలగించడానికే 15 ఏండ్లు పడుతుందని తెలిపారు. కాగా, 2014లో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో మరణించిన తమ సైనికుడు ఓరన్ సాహుల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఇజ్రాయెల్ ఒక ప్రకటనలో తెలిపింది.

దళిత బాలిక కిడ్నాప్.. కారులో రేప్

యూపీలో దారుణం

లక్నో, జనవరి 19: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ 16 ఏండ్ల బాలికను కిడ్నాప్ చేసిన ఓ వ్యక్తి, కారులో తీసుకెళ్తూ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతేకాదు ఈ దారుణాన్ని నిందితుడు తన ఫోన్‌లో రికార్డ్ చేసినట్టు పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో నిందితుడు రషీద్‌ను గత శుక్రవారం అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన వివరాల్ని పోలీసులు ఆదివారం మీడియాకు వెల్లడించారు. కారు డ్యాష్‌బోర్డ్‌లో లభించిన ఐడెంటిటీ కార్డుతో నిందితుడ్ని పట్టుకున్నామని, చెత్త పడేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన టీనేజ్ యువతిని కారులో వచ్చిన రషీద్ అనే వ్యక్తి కిడ్నాప్ చేశాడని, అదే కారులో లైంగికదాడికి పాల్పడ్డాక గ్రామానికి సమీపంలోని ఓ రోడ్డు పక్కకు ఆమెను తోసేసి వెళ్లాడని పోలీసులు చెప్పారు. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో యువతి తల్లిదండ్రులు ఇద్దరూ లేరని, కులం పేరుతో ఆమెను దూషిస్తూ లైంగికదాడికి పాల్పడ్డాడని పోలీసులు వివరించారు. అతడు ఠాకూర్‌ద్వారా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందినవాడని తెలిసింది.

హెచ్-1బీ వీసాలపై అమెరికన్ కంపెనీల విముఖత

ట్రంప్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో రిమోట్ ఉద్యోగుల నియామకానికి మొగ్గు

వాషింగ్టన్, జనవరి 19: అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టేందుకు సమయం ఆసన్నమైంది. సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈసారి ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టగానే హెచ్-1బీ వీసా నిబంధనల్లో భారీ మార్పులు జరిగే అవకాశం ఉండటంతో అమెరికన్ కంపెనీల యజమానులు, విదేశీ ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీసా నిబంధనల మార్పు వల్ల ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఇప్పటికే చాలా అమెరికన్ కంపెనీలు రిమోట్ ఉద్యోగులను నియమించుకుంటున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం అమెరికన్ కంపెనీలు హెచ్-1బీ వీసాల జోలికి వెళ్లడంలేదని, కఠిన నిబంధనలతోపాటు ధరల పెరుగుదల, లాటరీ వ్యవస్థతో ఏర్పడిన అనిశ్చితి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ వీసాను చివరి ప్రయత్నంగా పరిగణిస్తున్నాయని డికిన్సన్ రైట్ లా ఫర్మ్ భాగస్వామి కాథ్లీన్ కాంప్‌బెల్ వాకర్ తెలిపారు. వీసా నిబంధనలు మారడం ఖాయమని తేలడంతో ఇప్పటికే హెచ్-1బీ వీసాలు పొందిన భారతీయ ఉద్యోగులంతా అమెరికాలోనే ఉండాలని వారి లాయర్లు, యజమానులు సూచిస్తున్నారు. ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగుల నియామకంలో పారదర్శకతను పెంపొందించేందుకు ట్రంప్ ప్రభుత్వం త్వరలో ఆధునీకరించిన హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది.

అమెరికాలో టిక్‌టాక్ నిలిపివేత

నిషేధానికి ముందే చైనా కంపెనీ నిర్ణయం



హూస్టన్, జనవరి 19: నిషేధ ఉత్తర్వులు అమలులోకి రావడానికి కొన్ని గంటల ముందు ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ అమెరికాలో తన కార్యకలాపాలను నిలిపివేసింది. శనివారం రాత్రి టిక్‌టాక్ అమెరికా నుంచి నిష్క్రమించింది. టిక్‌టాక్‌ను నిషేధిస్తూ అమెరికాలో ఓ చట్టం రావడం దురదృష్టకరమని, ఇప్పటికి మీరు టిక్‌టాక్‌ను ఉపయోగించలేరంటూ అమెరికాలో ఈ యాప్‌ను ఓపెన్ చేసిన యూజర్లకు ఓ మెసేజ్ దర్శనమిస్తోంది. తాను అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టిక్‌టాక్‌ను పునరుద్ధరించేందుకు పరిష్కారం కనుగొంటానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం తమ అదృష్టంగా ఆ మెసేజ్ పేర్కొంది. కాగా, టిక్‌టాక్ మూసివేత ప్రకటనను నాటకంగా బైడెన్ ప్రభుత్వం అభివర్ణించింది. టిక్‌టాక్ నిషేధం అమలు బాధ్యత రానున్న ట్రంప్ ప్రభుత్వానిదేనని బైడెన్ ప్రభుత్వం తెలిపింది. స్పష్టమైన హామీలు లేకుండా అమెరికాలో తమ కార్యకలాపాలు కొనసాగించలేమని, మూసివేత ఒక్కటే తమకు మార్గమని టిక్‌టాక్ తెలిపింది.

సైఫ్‌పై దాడి కేసులో బంగ్లా దేశీయుడి అరెస్ట్

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడిని ముంబై పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడు బంగ్లాదేశ్‌కు చెందిన షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)గా గుర్తించామని ఒక పోలీస్ ఉన్నత అధికారి చెప్పారు. థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్న చిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

వైద్యేతరులతో వైద్య బోధనా?

ఎన్ఎంసీ ముసాయిదాపై డాక్టర్ల మండిపాటు

న్యూఢిల్లీ, జనవరి 19: వైద్య సంస్థల్లో అధ్యాపక పోస్టుల్లో నియామకానికి సంబంధించిన అర్హతలపై జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఈ నెల 17న విడుదల చేసిన కొత్త ముసాయిదాపై వైద్యులు, వైద్య విద్యార్థులు మండిపడుతున్నారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నారు. కొత్త ముసాయిదా ప్రకారం వైద్యేతర రంగ అధ్యాపకులు కూడా సీనియర్ రెసిడెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లతో పాటు అనాటమీ (శరీర నిర్మాణ శాస్త్రం), బయోకెమెస్ట్రీ (జీవ రసాయన శాస్త్రం), ఫిజియాలజీ (శరీర ధర్మ శాస్త్రం) సబ్జెక్టులలో ఉన్నత పదవులకు అర్హులవుతారు. పైన పేర్కొన్న సబ్జెక్టులలో అర్హులైన అధ్యాపకులు లభించకపోతే ఆయా సబ్జెక్టులలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేసి, సంబంధిత రంగాలలో శిక్షణ, అనుభవం ఉన్న వారిని పరిమిత కాలం పాటు అధ్యాపకులుగా నియమించవచ్చునని ఎంఎన్‌సీ తన కొత్త ముసాయిదాలో పేర్కొంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వైద్యేతర సిబ్బందిని నియమించాలనుకోవడం వైద్య విద్య నాణ్యతను దిగజార్చడమేనని మెడికల్ డాక్టర్లు పేర్కొంటూ దేశవ్యాప్త ఆందోళనకు దిగారు. ప్రైవేట్ వైద్య కళాశాలలు దీనిని దుర్వినియోగానికి వాడుకుంటాయని, తద్వారా నాణ్యత గల బోధనా సిబ్బంది కరవవుతారని యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్య మిట్టల్ ఆరోపించారు. ఈ పోస్టుల్లో వైద్యేతర సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో నియమించరాదని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీపై కేసు

గువాహటి: కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అస్సాంలోని గువాహటిలో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్ ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తోపాటు భారత రాజ్యంతో కూడా పోరాడుతోందంటూ ఈనెల 15న రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ ప్రకటన భావ ప్రకటనా స్వేచ్ఛ హద్దులు దాటిందని, దేశంలో అశాంతికి దారితీయగలదని మాంజిత్ చేటియా అనే వ్యక్తి గువాహటి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బెంగళూరు మెట్రో రైలు చార్జీల పెంపు!

- **30-40 శాతం మేర వడ్డన**
- **ఈ నెల నుంచే అమల్లోకి**
- **బీఎంఆర్‌సీఎల్ వెల్లడి**
- **ఇప్పటికే బస్సు చార్జీలను 15% పెంచిన కాంగ్రెస్ సర్కారు**

బెంగళూరు, జనవరి 19: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రజలపై మరో ధరల పిడుగు పడనుంది. బెంగళూరు నగర పౌరులకు అక్కడి మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీఎల్) షాక్ ఇవ్వబోతున్నది. మెట్రో రైల్ చార్జీలను భారీగా పెంచడానికి రంగం సిద్ధం చేసింది. మెట్రో రైల్ నిర్వహణ ఖర్చులు పెరిగినందున రైల్ చార్జీల ధరలను 30 నుంచి 40 శాతం వరకు పెంచకతప్పటం లేదని, పెంచిన చార్జీలు జనవరిలోనే అమల్లోకి తీసుకొస్తున్నామని తాజాగా ప్రకటించింది. రాష్ట్ర రవాణా శాఖ అన్ని క్యాటగిరిల్లోని బస్ చార్జీలను 15 శాతం పెంచిన వెంటనే బీఎంఆర్‌సీఎల్ కూడా ఆ దిశగా నిర్ణయం తీసుకోవటం గమనార్హం. 'చార్జీల పెంపుదలకు బీఎంఆర్‌సీఎల్ బోర్డ్ దాదాపు ఆమోదముద్ర వేసింది. సవరించిన చార్జీలు త్వరలోనే అమల్లోకి వస్తాయి' అని బీఎంఆర్‌సీఎల్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మెట్రో రైల్ నడవటం లేదని, సంస్థ తీసుకున్న రుణాలు చెల్లించాల్సి ఉందన్నారు.

బాబా రాందేవ్‌పై అరెస్ట్ వారంట్

జారీ చేసిన కేరళ కోర్టు

పాలక్కాడ్ : యోగా గురువు, పతంజలి ఆయుర్వేద్ వ్యవస్థాపకుడు బాబా రాందేవ్, ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణలకు కేరళలోని పాలక్కాడ్ జిల్లా కోర్టు బెయిలు ఇవ్వదగిన అరెస్ట్ వారంట్‌ను ఈ నెల 16న జారీ చేసింది. పతంజలి ఆయుర్వేద్ తన ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నదని కేరళ డ్రగ్ రెగ్యులేటర్స్ చేసిన ఫిర్యాదుపై ఈ చర్య తీసుకుంది. కన్నూరుకు చెందిన కేవీ బాబు 2023 నవంబరులో పతంజలి ప్రకటనలపై ఫిర్యాదులు చేశారు. వీటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేరళ డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ రాష్ట్రంలోని తన కార్యాలయాలను ఆదేశించింది.

మహా కుంభ మేళాలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం

- **పేలిన ఎల్పీజీ సిలిండర్**
- **18 గుడారాలు దగ్ధం**
- **ఎలాంటి ప్రాణనష్టం లేదు**

ప్రయాగ్‌రాజ్: ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో సెక్టార్ 19లో మంటలు చెలరేగి 18 గుడారాలు ఆహుతైనట్టు అధికారులు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. నల్లటి దట్టమైన పొగలు అలుముకోవడంతో అఖాడాల సమీపంలో భయాందోళన నెలకొంది. సాయంత్రం 4 గంటలకు మంటలు అంటుకోగా గంటలోపలే మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. కాగా, మౌని అమావాస్య ఏర్పాట్లను సమీక్షించేందుకు ప్రయాగ్‌రాజ్‌లోనే ఉన్న సీఎం యోగి ఆదిత్యనాథ్ ఘటనా స్థలిని పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. 45 రోజులపాటు జరిగే మహా కుంభమేళా జనవరి 13న పౌష పూర్ణిమ నాడు ప్రారంభమైంది. శనివారం వరకు 7.72 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఆదివారం దాదాపు 46.95 లక్షల మంది పవిత్ర స్నానాలు ఆచరించారని అధికారులు చెప్పారు.

సీఆర్‌పీఎఫ్ డీజీగా జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్

న్యూఢిల్లీ: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన తన పదవీ విరమణ తేదీ 2027 నవంబరు 30 వరకు కొనసాగుతారు. క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం ఈ మేరకు ఆదేశాలను విడుదల చేసింది. ఆయన ప్రస్తుతం అస్సాం డీజీపీగా పని చేస్తున్నారు. ఆయన 1991 బ్యాచ్ అస్సాం-మేఘాలయ క్యాడర్ ఐపీఎస్ అధికారి. అనీష్ దయాల్ సింగ్ గత నెల 31న పదవీ విరమణ చేసినప్పటి నుంచి అఫిషియేటింగ్ ఛార్జిని వితుల్ కుమార్ నిర్వహిస్తున్నారు.

రైతులతో చర్చలకు కేంద్రం సంసిద్ధత

ఫిబ్రవరి 14న సమావేశం.. డల్లేవాల్‌కు చికిత్స మొదలు

చండీఘడ్, జనవరి 19: పంజాబ్ సరిహద్దుల్లో నిరసన చేస్తున్న రైతులతో ఫిబ్రవరి 14న కేంద్రం చర్చలు జరపనుంది. కేంద్ర సర్కారు, రైతు సంఘాల నేతలు చర్చలపై ఒక అంగీకారానికి వచ్చారు. కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ ఎస్కేఎం(రాజకీయేతర), కేఎంఎం సంఘాల నేతలతో శనివారం శంభు సరిహద్దు వద్ద జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో చర్చల తేదీని ఖరారు చేశారు. 55 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత డల్లేవాల్‌తో కూడా కేంద్ర బృందం చర్చలు జరిపింది. రైతుల డిమాండ్లపై చర్చలకు కేంద్రం సిద్ధంగా ఉందని వారు తెలపడం, రైతు నేతలు పదే పదే విజ్ఞప్తి చేయడంతో వైద్య చికిత్సకు ఆయన ఎట్టకేలకు అంగీకరించారు. కేంద్రంతో జరిగే చర్చల్లో డల్లేవాల్ పాల్గొనే అవకాశం ఉంది. జనవరి 26న ఢిల్లీ దిశగా తాము నిర్వహించాలనుకున్న కవాతులో ఎలాంటి మార్పు ఉండదని రైతు నేతలు స్పష్టం చేశారు.

దేశంలో మొదటి ఎయిర్ ట్యాక్సీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 19: హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాల్లో జనాలు 'ఎయిర్ ట్యాక్సీ' ఎక్కే రోజులు ఎంతో దూరంలో లేవు! రోడ్డుమీద ఓ ఆటో లేదా ఓ ట్యాక్సీ ఎక్కినట్టుగా..'ఎయిర్ ట్యాక్సీ' ఎక్కి, గాలిలో ప్రయాణించే సదుపాయం రాబోతున్నది. ఇండియాలో మొట్టమొదటి ఎయిర్‌ట్యాక్సీ నమూనాను ఓ స్టార్టప్ కంపెనీ తాజాగా ప్రదర్శించింది. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ఎయిర్ ట్యాక్సీ 'శూన్య'ను బెంగళూరుకు చెందిన ఏరోస్పేస్ స్టార్టప్ సర్లా ఏవియేషన్ ఆవిష్కరించింది. ఎయిర్ ట్యాక్సీ సేవలను 2028నాటికి బెంగళూరు నగర పరిధిలో ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది. 'శూన్య' ఎయిర్ ట్యాక్సీ గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. 20 నుంచి 30 కిలోమీటర్ల స్వల్ప దూరంలో రాకపోకలు సాగించేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. దీంట్లో గరిష్ఠంగా ఆరుగురు ప్రయాణించవచ్చునని, మహా నగరాల పరిధిలో ప్రజల అత్యవసర వైద్య సేవల కోసం ఉచిత ఎయిర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నామని కంపెనీ చెప్పింది.

సొమ్ము చెల్లించి మరీ జైళ్లకు!

- *ఒంటరితనం భరించలేక జపాన్ వృద్ధ మహిళల తీవ్ర అవస్థలు*
- *పేదరికం కారణంగా మరికొందరు*
- *వృద్ధాశ్రమాలుగా మారుతున్న జైళ్లు*



నాలుగింతలైన ఖైదీల సంఖ్య

ఓఈసీడీ నివేదిక ప్రకారం.. 65 ఏండ్లు పైబడిన జపాన్ మహిళల్లో 20 శాతం మంది కడు పేదరికంలో మగ్గుతున్నారు. కనీసం తిండి పెట్టే దిక్కులేక చాలామంది మహిళలు దొంగతనాలు చేసి జైళ్లకు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. జైళ్లలో ఉన్న మహిళా ఖైదీల్లో ఎక్కువ మంది చేసిన నేరం దొంగతనం కావడం గమనార్హం. ఆ దేశ ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 2022లో జైళ్లలో ఉన్న మహిళా ఖైదీల్లో సుమారు 80 శాతం చోరీలకు పాల్పడినవారే. 2003 నుంచి 2022 మధ్యకాలంలో 65 ఏండ్లకు పైబడిన ఖైదీల సంఖ్య నాలుగింతలైంది.

టోక్యో, జనవరి *19:* అక్కడి గదులన్నీ వృద్ధులతో నిండి ఉన్నాయి. వారి చేతులు ముడతలు పడ్డాయి. నడుములు వంగిపోయాయి. కొంతమంది నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. మరికొందరు వాకర్స్ వాడుతున్నారు. వారికి అక్కడి సిబ్బంది సాయం చేస్తున్నారు. ఇదంతా చూసి అదేదో వృద్ధాశ్రమం అనుకుంటే మీరు పొరబడినట్టే. అది జపాన్‌లోని అతిపెద్ద మహిళా కారాగారం. ఆ దేశంలోని వృద్ధ జనాభాకు ఈ జైలులోని పరిస్థితులే నిదర్శనం.

తిరిగి చెల్లించేందుకు సిద్ధం

పేదరికం, ఒంటరితనం కారణంగా జపాన్‌లోని చాలామంది వృద్ధ మహిళలు బయట బతకలేక చిన్నచిన్న నేరాలు చేస్తూ జైళ్లకు వెళ్లేందుకు కూడా వెనకాడటం లేదు. మరి కొంతమందికి సిరులు ఉన్నా బాగోగులు చూసుకునే దిక్కు లేక నెలకు *20-30* వేల యెన్‌ల వరకు చెల్లించి మరీ జైలుకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. దీన్నిబట్టే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కేర్ టేకర్లకు పెరుగుతున్న డిమాండ్

జైలు జీవితం గడిపాక బయటికి వస్తున్నవారి ప్రవర్తనలో పెద్దగా మార్పు రావడం లేదు. బయట వారి బాగోగులు చూసుకునే వ్యక్తులు లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం వారి సంక్షేమానికి చర్యలు చేపడుతున్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. అయితే, ఈ సమస్య కొంతమందికి ఉపాధి మార్గంగా మారింది. వయసు పైబడిన వారి బాగోగులు చూసుకునే కేర్ టేకర్లకు అక్కడ భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 2040 నాటికి ఈ రంగంలో పని చేసేందుకు 2.72 మిలియన్ల మంది అవసరం.

ట్రైన్ టు కశ్మీర్

కశ్మీర్‌కు తొలి రైలు.. ట్రయల్ రన్ సక్సెస్

జమ్ము, జనవరి 19: దేశాన్ని కశ్మీర్‌తో అనుసంధానించే రైలు మార్గంలో తొలి రైలు ట్రయల్ రన్ విజయవంతమైందని రైల్వే అధికారులు ఆదివారం ప్రకటించారు. కాట్రా-శ్రీనగర్ స్టేషన్ల మధ్య 22 బోగీలతో కూడిన రైలు ప్రయాణాన్ని పరీక్షించామని వారు తెలిపారు. కొత్తగా నిర్మించిన బ్రాడ్‌గేజ్ లైనులో ప్రయాణికుల రైళ్లు గరిష్ఠంగా గంటకు 85 కి.మీ వేగంతో పయనించడానికి రైల్వే భద్రత కమిషనర్(ఉత్తరం సర్కిల్) ఆరు రోజుల క్రితం అనుమతి ఇచ్చారు.